విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

శుక్రవారం 29, డిసెంబరు 2023 4 పేజీలు

అగ్నిప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ చేయూత

విశాలాంధ్ర-జలదంకి: జలదంకి పంచాయతీ పరిధిలో ఉన్న నెహ్రూ నగర్ కాలనీలో మంగళవారం తెల్లవారు జామున అగ్నిప్రమాద కారణంగా సర్వం కోల్పోయిన కుటుంబానికి జలదంకి మండల రెడ్ క్రాస్ శాఖ అండగా నిలిచింది. జలదంకి మండలంలోని నెహ్రూ నగర్ కాలనీకి చెందిన పొట్లూరి నాగరాజు ఇల్లు అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోగా, ఈ కుటుంబానికి రెడ్ క్రాస్ తక్షణ సహాయసామాగ్రిని అందజేశారు. వంట పాత్రలు, టార్పాలిన్ పట్ట, సబ్బులు, టూత్ పేస్ట్ లతో కూడిన హైజిన్ కిట్ తదితర గృహోపకరణాలు ఈ సహాయసామాగ్రిలో ఉన్నాయి. ఈ సందర్భంగా జలదంకి మండల రెడ్ క్రాస్ చైర్మన్ వద్దే శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, విపత్కర పరిస్థితుల్లో పేద ప్రజలకు అండగా ఉంటూ పలు రకాల సేవలు ఇండియన్ రెడ్ క్రాస్ అందిస్తుందని తెలిపారు. రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ, కావలి సబ్ డివిజన్ శాఖల సహకారంతో ఈ సామాగ్రిని అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జలదంకి రెడ్ క్రాస్ కార్యదర్శి వాకా హాజరత్ రెడ్డి, కోశాధికారి పువ్వాడ సురేష్ కుమార్, కార్యవర్గ సభ్యులు యోగూరి రఘు, నవీన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ రూ.3 వేలకు పెంచుతూ ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నాం : సీఎం

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : జనవరి, 1వ తేది నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.3 వేలకు పెంచుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని పూర్తిగా నెరవేరుస్తూ విశ్వసనీయతకు ఈ ప్రభుత్వం మారు పేరు అని రుజువు చేస్తున్నామనిముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వర్చువల్‌గా రాష్ట్రం లోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశమై వైఎస్ఆర్ పించన్ కానుక, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత పథకాల అమలు డా బి.అర్అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాలపై సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుండి జిల్లా కలెక్టర్ యం. హరినారాయణన్, కందుకూరు, ఆత్మకూరుశాసనసభ్యులుమానుగుంటమహిధర్ రెడ్డి, మేకపాటి విక్రం రెడ్డి, నెల్లూరు నగర పాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్, ఉదయగిరి నియోజక వర్గ ఇంచార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి, విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, నూడా విసి టి. బాపి రెడ్డి, డిఆర్డిఎ, మెప్మా, ఐసిడిఎస్ పిడి లు సాంబశివా రెడ్డి, రవీంద్ర, హేనా సుజన, డిపిఓ సుస్మిత, డిఈఓ గంగా భవాని, డిడి సోషల్ వెల్ఫేర్ రమేష్, డిటిడబ్ల్యూఓ పరిమళ, డిఎండబ్ల్యూఓ నిర్మలా దేవి, మైనారిటీ కార్పొరేషన్ ఈడి హైపా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, జనవరి మాసంలో వై.ఎస్ ఆర్ పించన్ కానుక, వైఎస్ఆర్ ఆసరా, అంబేద్కర్ విగ్రహం ప్రారంభోత్సవం వంటి మూడు కార్యక్రమాలు, ఫిబ్రవరి మాసంలో వైఎస్ఆర్ చేయూత కార్యక్రమం మొత్తం నాలుగు ప్రధానమైన కార్యక్రమాలు చేస్తున్నామని, ఎక్కడాకూడా పొరపాట్లు లేకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్లకు

2

అక్రమ మైనింగ్‌పై చర్య తీసుకోని..

ఏపీ సీఎస్, డీజీపీ, డీఎంజీలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

అక్రమమైనింగ్లో ఉన్నతాధికారులకు వాటాలు..చర్యలలో అందుకే మౌనం

నెల్లూరు జిల్లాలో అక్రమ మైనింగ్‌కు సంబంధించి స్పందన కరువు

మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : అక్రమ మైనింగ్‌కు సంబంధించి ప్రభుత్వ ఉన్నతాధికారులపై నెల్లూరు గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి సహా డీఎంజీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ), నెల్లూరు జిల్లా కలెక్టర్, ఎస్పీలపై ఫిర్యాదు ఇచ్చారు. అనంతరం సోమిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో అక్రమ మైనింగ్‌పై ఉన్నతాధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు, పట్టించుకోనూ లేదని మండిపడ్డారు. మంత్రి కాకాణి ఇలాకాలో అక్రమ మైనింగ్ జోరుగా సాగుతోందని ఆయన ఆరోపించారు. ప్రమాదకర పేలుడు పదార్థాలు కూడా వున్నాయి. పేలుడు పదార్థాలు తెచ్చిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ఆయన నిలదీశారు. వరదాపురంలోని ప్రభుత్వ భూముల్లో వందల కోట్ల విలువైన క్వారీని ఎత్తేశారు. ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు బయటపడినా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవడంలో విఫలమైన కలెక్టర్, ఎస్పీ, డీజీపీ, సీఎస్, డీఎంజీలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి చర్యలుతీసుకోకపోతేన్యాయస్థానాన్నిఆశ్రయించబోతున్నామన్నారు.. పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీలోని వరదాపురాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మరో కేజీఎఫ్ గామార్చేశారని విమర్శించారు. సుమారు70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మైన్లలో నిక్షిప్తమైన వందల కోట్ల విలువైన క్వార్ట్జ్ ను కొల్లగొట్టేస్తున్నారు అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని డిసెంబర్ 2వ తేదీన సందర్శించి జీపీఎస్ ఆధారాలతో సహా ఎస్పీ నుంచి డీజీపీ వరకు, కలెక్టర్ నుంచి సీఎస్ వరకు, మైనింగ్ డీడీ నుంచి డీఎంజీ వరకూ అందరికీ ఫిర్యాదు చేశామన్నారు. మరోవైపు డిసెంబర్ 7న రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కూడా అక్రమమైనింగ్ ఆపాలని అధికారులను ఆదేశించిందిఅయినా అక్రమ మైనింగ్ ఆపలేదన్నారు. డిసెంబర్ 16న నేను నేరుగా మైన్లలోకి వెళ్లి మూడు రోజుల పాటు సత్యాగ్రహం చేపట్టాను మైన్లలో పెద్దసంఖ్యలో ప్రొక్లెయిన్లు, టిప్ప ర్లు, ట్రాక్టర్లు, మైనింగ్ సామగ్రితో పాటుప్రమాదకరమైన పేలుడు పదార్థాలను గుర్తించి అధికారులకు

2లో

టీడీపీతోనే ముస్లింల అభ్యున్నతి

ముస్లింల ఆత్మీయ సదస్సులో వక్తల అభిభాషణ

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు నగరంలో లోని జీపీఆర్ కళ్యాణమండపంలో నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన నెల్లూరు నగర రూరల్ నియోజకవర్గం ఇన్చార్జిలు నారాయణ,శ్రీధర్ రెడ్డి ల ఆధ్వర్యంలో నియోజకవర్గాల ముస్లింల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మాజీ శాసన మండలి చైర్మన్ మొహమ్మద్ అహ్మద్ షరీఫ్, టిడిపి రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు మూలాన ముష్కాక్ అహమద్, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహమ్మద్ అహమద్ షరీఫ్ మాట్లాడుతూ రాజ్యాంగం కలిగించిన ఓటు హక్కును నూటికి నూరు శాతం ఉపయోగించుకునేఏకైక సామాజిక వర్గంముస్లిం సామాజికవర్గమని,ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన అది ముస్లిం ఓట్ల బలంతోనేనని అన్నారు.రాష్ట్రంలో దాదాపు 50 నియోజక వర్గాల్లో ముస్లిం సామాజికవర్గ ఓటర్లు గెలుపు ఓటములను శాసిస్తున్నారన్నారు.లౌకికవాదాన్ని మతసామరస్యాన్ని కాపాడే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. ముస్లింల ప్రాణ మాన ఆస్తులను కాపాడటమే చంద్రబాబు లక్ష్యం అన్నారు. తన రెండు కళ్ళలో ఒక కన్ను ముస్లింలు ఒక కన్ను హిందువులని చెప్పిన నాయకుడు చంద్రబాబు అని, వైసిపి మాత్రం బిజెపికి తొత్తులుగా మారిబిజెపిఏం చెప్తే అది చేస్తున్నారని అన్నారు.ఎన్ఆర్సీకి మద్దతు పలికి ముస్లిం ప్రయోజనాలను తాకట్టుపెట్టిన వైసీపీకి ముస్లిం లను ఓటుఅడిగి అర్హత లేదని అన్నారు.ముస్లింలకు ఐదు వేల కోట్లబడ్జెట్ కేటాయించిఅధిక శాతంలో లోన్లనుఇప్పించిన ఘనత చంద్రబాబుదిఅన్నారు. అబ్దుల్అజీజ్ మాట్లాడుతూ ముస్లిం ప్రజానికానికి టిడిపి చేసిన మంచిని వైసీపీ చేసిన ద్రోహాన్ని ప్రజలకు తెలపాల్సిన అవసరం మనందరిపైనా ఉందని అన్నారు.ప్రజావేదికతో కూల్చివేతతో ప్రారంభమైన అరాచక పాలన ప్రజల ఆస్తులు సైతం ధ్వంసం చేసే వరకు వచ్చింద న్నారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్ ను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు.రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అందుకోసం నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు గా నారాయణ, కోటంరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.నెల్లూరురూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సంక్షేమం పేరుతో పది రూపాయలు ఇచ్చి పేదవారి దగ్గరనుంచి వివిధ రూపాల్లో 100 రూపాయలు లాగిస్తున్నారని విమర్శించారు..ఆంధ్ర రాష్ట్రంలో నిత్యా వసరాలు, కరెంట్ చార్జీలు అత్యధికంగా పెరిగాయని, ఆంధ్ర రాష్ట్రంలో కరెంట్ బిల్లుతాకితే షాక్ కొడుతుందని విమర్శించారు. దేశంలో ఎన్ఆర్సిఎన్ పి ఆర్ చట్టాలు వచ్చినప్పుడు వ్యతిరేకించిన ఏకైక ఎమ్మెల్యే తాను ఒక్కడి నేనని ఉద్యమాన్ని ఆపకపోతే బుల్లెట్లతో కాలుస్తామని బెదిరించిన పోరాటాన్ని ఆపలేదని అన్నారు.ఎన్ఆర్సి సమయంలో తెలుగుదేశం పార్టీలో అబ్దుల్ అజీజ్ నాయకత్వంలో ఎన్నో పోరాటాలు చేశారని, కష్టకాలంలో ఉన్నప్పుడు

2

భూ పంపిణీలో జిల్లాలోని సర్వేపల్లి అగ్రస్థానం : మంత్రి కాకాణి

విశాలాంధ్ర-ముత్తుకూరు : జిల్లాలో జరిగిన భూ పంపిణీ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గంలో 6,610 ఎకరాల భూ పంపిణీ జరిగిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం ముత్తుకూరు మండలంలోని పిడత పోలూరు గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ .48 లక్షలు, నుడ నిధులు రూ.55 లక్షల వ్యయం తో నిర్మించిన సిసి డ్రైన్‌లను మంత్రి ప్రారంభించారు. విద్యార్థినీ, విద్యార్థులకు టాబ్ లు,పేదలకు కొత్త ఆరోగ్య శ్రీ కార్డులు,ఇళ్లస్థలాలు,రైతులకు పశుదానామృతమ్ అంద జేశారు. అనంతరంగ్రామం లోజరిగిన కార్యక్రమంలో మంత్రి కాకాణి మాట్లాడారు. జిల్లాలో జరిగిన తొమ్మిది నియోజకవర్గాలకు సంబంధించి 8,094 ఎకరాలు పంపిణీ చేయగా అందులో కేవలం ఒక్క సర్వేపల్లి నియోజకవర్గం లోని 6610 ఎకరాలు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎవరు చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఆరోగ్య భద్రత కల్పించి మెరుగైన వైద్యం అందించాలని లక్ష్యంతో 25 లక్షల రూపాయలు వరకు వైద్య సేవలు అందే విధంగా చేశారన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ కింద వైద్యం అంటే పట్టించుకునే వారు కాదని ప్రస్తుతం ఆ విధంగా లేదని ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య భరోసా కల్పించిన ఘనత తమ ప్రభుత్వం అన్నారు . అదేవిధంగా ఇటీవల జగనన్న సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతోమందికి ఉచిత వైద్యం అందించడం జరిగిందన్నారు. 104,108 ద్వారా వైద్య సేవలు అందించడంతో పాటు వాలంటీర్లు ఇంటి వద్దకే మందులు అందించే విధంగా సౌకర్యం కల్పించారన్నారు. పేద వారి ఇంటి వద్దకే వైద్యం అందించిన ఘనత ముఖ్యమంత్రి దక్కిందన్నారు. గతంలో మాదిరి కాకుండా ఆ కుటుంబం మొత్తం వైద్య సౌకర్యం పొందే విధంగా ఆరోగ్యశ్రీ సౌకర్యాన్ని కల్పించారన్నారు. పేదలకు ఇంటి వద్దకే మందుల పంపిణీ కార్యక్రమాన్ని కూడా త్వరలో ప్రభుత్వం చేపడుతుందని ఆయన తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఈ బీసీ నేస్తం ఒక్కొక్క కుటుంబానికి 15 వేల రూపాయలు వందసం పంపిణీ చేశామన్నారు. మత్స్య కార్యతర ప్యాకేజీని మండలంలోని తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 25 వేల రూపాయలు పంపుతాను ముఖ్యమంత్రి ని ఒప్పించి నిధులు మంజూరు చేయించి ఎన్ని ఆటంకాలు ఎదురైనా పంపిణీ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చడం జరిగిందన్నారు. మత్స్యకారులకు నేలటూరు వద్ద ఫిషింగ్ జెట్టి శంకుస్థాపన చేయడం జరిగింది

2లో

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం ఇచ్చినట్లు వివరించారు. అత్యంత ప్రమాదకరమైన పేలుడు పదార్థాల వివరాలను పక్కా అధారాలతో ఉన్నతాధికారులందరి దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని వాపోయారు. మైన్లలో జరుగుతున్న భారీ పేలుళ్లతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపు తున్నామని తెలిపారు. క్వారీ సమీపంలో నివా సం ఉంటున్న గిరిజనులు వచ్చి ఆవేదన వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కలెక్టరేట్ లో జరిగే స్పందన కార్యక్రమంలో మా నాయ కులు, ప్రజాప్రతినిధులు ఆధారాలను అధికారులకు చూపించారని తెలిపారు. వైజాగ్‌లో ఉండే సెంట్రల్ ఎక్స్ ప్లోజివ్స్ డిపార్టుమెంటు డీడీకి ఫిర్యాదు చేస్తే ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీతో పాటు పొదలకూరు పోలీసులను డిసెంబర్ 19న ఆదేశించారు. ఈరోజు వరకు ఏ స్థాయిలోనూ అధికారులు స్పందించకపోవడంతో ఇప్పుడు నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. సత్యాగ్రహం సమయంలో మేం మీడియా సాక్షిగా చూపించిన అత్యంత ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు ఏమయ్యాయని నిలదీశారు. మావోయిస్టులు ఎత్తుకెళ్లారా, ఉగ్రవాదులు తీసుకెళ్లారా, గంజాయి బ్యాచ్ ఎత్తుకెళ్లిందా..లేక కాకాణి గోవర్ధన్ రెడ్డి బ్యాచ్ తీసుకెళ్లిందా నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. మొత్తంగా వరదాపురంలోని మైన్లలో నుంచి వందల కోట్ల రూపాయల విలువైన క్వార్ట్జ్‌ను కాకాణి మైనింగ్ మాఫియా లేపేసిందన్నారు. ప్రభుత్వ భూములు,మేతపోరంబోకులు,దేవాదాయ శాఖ భూముల్లోని విలువైన ఖనిజాన్ని కాకాణి మాఫియా కొల్లగొడుతోందని ఆరోపించారు. ప్రకృతి ప్రసాదించిన వేల కోట్ల విలువైన ప్రజల సొత్తును మాఫియా లేపేస్తుంటే అధికారులు వాటాలు తీసుకుని చెక్కభజన చేసుకుంటున్నారని విమర్శించారు. అధికారు లందరూ వాటాలు తీసుకోకపోతే చర్యలు తీసుకునేందుకు ఎందుకు జంకుతున్నారని ఆయన ప్రశ్నించారు. ఎవరిని చూసి భయపడుతున్నారు కలెక్టర్, ఎస్పీ కంటే హెడ్ కానిస్టేబుళ్లు మేలుగా ఉన్నారని పేర్కొన్నారు. కనీసం దొంగలనైనా పట్టుకుంటున్నారు కానిస్టేబుళ్లు కష్టపడి దొంగలను పట్టుకొస్తే వారికి ముసుగులేసి నిలబెట్టి ఎస్పీ మీడియాతో గొప్పలు చెప్పుకుంటూ, ఫొటోలకు ఫోజులిస్తూ గడిపేస్తున్నారన్నారు. అత్యంత ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు రెడ్ హ్యాండెడ్ గా దొరికితే మాత్రం ఆయన ఎందుకు స్పందించరని నిలదీశారు.సైదాపురం నుంచి రాపూరు వరకు, గూడూరు నుంచి పొదలకూరు వరకు ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా అక్రమ మైనింగ్‌జరుగుతోందన్నారు. మొత్తంగా ఆర్నెళ్లలో 3వేలకోట్ల విలువైన తెల్లరాయిని కొల్లగట్టే శారన్నారు. ఆధారాలతో సహా అక్రమాలను బయటపెట్టినా పట్టించుకోని కలెక్టర్, ఎస్పీ, సీఎస్, డీజీపీ, డీఎంజీలపై నెల్లూరు రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇక్కడితో వదిలిపెట్టను. కోర్టును కూడా ఆశ్రయించబోతున్నట్లు వెల్లడించారు. బుధవారం రాత్రి కూడా వరదాపురంలోని మైన్లలో అక్రమ మైనింగ్ కొనసాగించినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మైనింగ్‌తో పాటు వరదాపురంలో వెలుగు జూసిన ప్రమాదకరమైన పేలుడు పదార్థాల విషయమై చర్యలు తీసుకోవాలని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.

పెన్షన్ రూ.3 వేలకు పెంచుతూ ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నాం : సీఎం

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. ప్రతి కార్యక్రమానికి ప్రీలాంచ్, లాంచ్, పోస్ట్ లాంచ్ కార్యక్రమాలు ఉంటాయనీ, అవి సక్రమంగా నడిచేలా కలెక్టర్లు షెడ్యూల్ రూపొందించుకోవాలన్నారు. జనవరి నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.3 వేలకు పెన్షన్ పెంచుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని పూర్తిగా నెరవేరుస్తూ విశ్వసనీయతకు ఈ ప్రభుత్వం మారు పేరు అని రుజువు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం ఎన్నికలకు 2 నెలల ముందు వరకూ పెన్షన్ కేవలం రూ.1000 మాత్రమే ఇచ్చేవారని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2,250 లు చేశాం. ఇప్పుడు రూ.3 వేల వరకూ పెంచుకుంటూ వచ్చమని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో సగటున పెన్షన్ల కోసం నెలకు 400 కోట్ల మాత్రమే ఖర్చు చేసేవారని, నేడు నెలకు రూ.1950 కోట్ల ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో పెన్షన్ల సంఖ్య 39 లక్షలు ఉండగా,ఈ ప్రభుత్వంలో66 లక్షల మందికి వైఎస్ఆర్ పించన్ కానుక అందచేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. అర్హత ఉన్న ఏ లబ్ధిదారుడు మిగిలిపోకూడదన్న ఉద్దేశ్యంతో గ్రామస్థాయిలో వాలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకురావడం జరిగిందన్నారు. ఆదివారమైనా, పండుగైనా సరే ఒకటో తారుఖీన చక్కటి చిరునవ్వుతో పెన్షన్‌ను ఇంటివద్దే ఇచ్చే పరిస్థితిని, మార్పును తీసుకురాగలిగామని, ఈ మార్పును ఎలా తీసుకు రాగలిగామన్నది ప్రతి గడపకూ తెలియజేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు."రెండో కార్యక్రమం కింద జనవరి 19న అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని, మూడో కార్యక్రమం కింద జనవరి 23 నుంచి 31 వరకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం, నాలుగో కార్యక్రమం కింద వైఎస్సార్ చేయూత కార్యక్రమం ఫిబ్రవరి 5 నుంచి 14వరకూ కొనసాగుతుందని, ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా ఈ నాలుగు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అర్హత ఉండీ ఎవరైనా ఎక్కడైనా మిగిలిపోయిన సందర్భాల్లో వారికి పథకాలు వర్తింపు చేసే బై యాన్యువల్ కార్యక్రమం జనవరి 5న జరుగుతుందని, ఈ కార్యక్రమం జరిగే లోపే దాదాపు 1.7 లక్షల పెన్షన్లు జనవరి ఒకటో తేదీ నుంచే ఇస్తారని, 66,34,742మందికి రూ.1968 కోట్లకుపైగా పెన్షన్ల రూపంలో అందుతాయని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఈ కార్యక్రమాల్లో సచివాలయం స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులను, అధికారులను భాగస్వాములు చేసి ఈ కార్యక్రమాలు ఎలాంటి పొరపాట్లు జరగకుండా విజయవంత అయ్యేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలనిముఖ్యమంత్రి, కలెక్టర్లకు సూచించారు.

నూతన గృహ ప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి

విశాలాంధ్ర-ఆత్మకూరు : ఆత్మకూరు ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ మస్తానయ్య నూతన గృహ ప్రవేశవేడుకల్లో ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి హాజరై వారి కుటుంబ సభ్యులకు శుభాభినందనలు తెలిపారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో డాక్టర్ మస్తానయ్య నూతన గృహానికి ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో హాజరైన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డికి డాక్టర్ మస్తానయ్య కుటుంబసభ్యులు సాదర స్వాగతం పలికారుఆయన వెంట జెసీయస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ సర్దార్, డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్, ప్రముఖ వైద్యులు, యువ నాయకులు డాక్టర్ ప్రణీత్ కుమార్, నోటి వినయ్ కుమార్ రెడ్డి ఉన్నారు.

అలరించిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన

విశాలాంధ్ర - కావలి : స్థానిక రాజ వీధిలోని ఓవెల్ మినర్వా పాఠశాల లో గురువారం విద్యార్థులు చేసిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన అలరించింది. అకడమిక్ సైన్స్ ఎక్స్ పో - 2023 లో భాగంగా సైన్స్ లాంచర్ -2 కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాలైన సైన్స్ మోడల్స్ ప్రదర్శించి అద్భుత ప్రదర్శన కనబరిచారు. సౌర శక్తి తో నీటి శుద్ధి, రెయిన్ హార్వెస్టింగ్, ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ సిస్టం, రీ సైకిల్ కుకింగ్ ఆయిల్, రీసైక్లింగ్ ఆఫ్ యూస్డ్ పెన్స్, తదితర సైన్స్ మోడల్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి. సురేష్ శాస్త్ర సాంకేతికత దాని అభివృద్ధి ఆవశ్యకత గురించి వివరంగా తెలియజేశారు. ఈ ప్రదర్శనలో 220 మోడల్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి సుకుమార్, కన్వీనర్ శివయ్య, కో-కన్వీనర్ సుమలత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఇంటూరి నాగేశ్వరరావు

విశాలాంధ్ర-లింగసముద్రం : లింగసముద్రం మండలం పెద్దపవని గ్రామానికి చెందిన కోటుపల్లి వెంకట రమేష్ బాబు, ప్రమీల కుమారుడు వెంకట అఖిల్, వెంకట సాయి హర్షిత వివాహం జరిగింది..కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరావు వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కావలి పట్టణ అటవీ ప్రాంతంలో మృతదేహం

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని పీజీ కాలేజ్ వెనుక గల అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం గురువారం కలకలం రేపింది. సుమారు వారం రోజుల క్రితం మృతి చెందిన 50 సంవత్సరాల వయసు గల మగ వ్యక్తి మృతదేహంగా గుర్తించారు. పూర్తిగా శరీరం కుళ్ళిపోయి ఉంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలతో కావలి ప్రజలు భయంతో భీతిల్లుతున్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి : ఎంపీపీ

విశాలాంధ్ర-ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేసి గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆత్మకూరు మండల పరిషత్ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీ ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రానున్న మూడు నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కంభంశెట్టి ప్రమీల, సొసైటి చైర్మన్లు సానా వేణుగోపాల్ రెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఏఓ శ్రీనివాసరావు, సర్పంచ్ లు సూరం ప్రసాద్ రెడ్డి, ఎం సతీష్ రెడ్డి, బొలిగర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికి తీయడమే ఉద్దేశం

24

విశాలాంధ్ర-అనుముసముద్రంపేట: గ్రామీణ ప్రాంతాలలోని ఉత్సాహవంతమైన క్రీడాకారులను లను ప్రపంచానికి పరిచయం చేయాలన్నదే ఆడదాం ఆంధ్ర ముఖ్య ఉద్దేశమని ఆర్డిఓ మధులత తెలిపారు.ఆడుదాం ఆంధ్ర ఏ ఎస్ పేట నందు జరిగిన ఆటల పోటీలు ఆమె గురువారం పరిశీలించారు. మండల పరిషత్ అధ్యక్షులు శ్రీమతి బి పద్మజా రెడ్డి తో కలిసి ఆమె కొంతసేపు ఆటలను తిలకించారు. అనంతరం ఆమె ఏఎస్పేట లోని శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ వారి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ హుస్సేన్ ఆర్డీవోకు దగ్గరుండి ప్రార్థనలు చేయించారు.

టీడీపీతోనే ముస్లింల అభ్యున్నతి

(మొదటి పేజీ తరువాయి)

అబ్దుల్ అజీజ్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా మౌలానా ముష్టాక్ అహమద్ మాట్లాడుతూవైసిపికి ముస్లింల పై కపట ప్రేమని చూపిస్తున్నారని టిడిపి హయాంలో నిర్మించిన హజ్ హౌస్ ముస్లింలకు ఉపయోగపడకుండా వాటికి తాళాలు వేశారని విమర్శించారు.డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మతపరమైన సదస్సులో గొప్పలు చెప్పడం తప్ప సమాజానికి చేసింది ఏమీ లేదని, మైనార్టీలపై దాడులు, అన్యాయం జరిగినా స్పందించిన దాఖలాలు లేవని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైసిపి చేసేది సామాజిక సాధికార బస్సుయాత్ర కాదని సామాజిక ద్రోహ బస్సుయాత్ర అని పేర్కొన్నారు. ముస్లిం సమాజం విషయంలో జగన్మోహన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పారని అలాంటి వ్యక్తిని గద్దె దింపాల్సిన అవసరం ఉందని అన్నారు.కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, తాళ్లపాక అనురాధ, పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు మొయినుద్దీన్, నగర అధ్యక్షులు మామీదాల మధు, నగర నియోజకవర్గ పరిశీలకులు కరిముల్లా, నన్నే సాహెబ్, జాఫర్ షరీఫ్, హయాద్ బాబా, ఇక్బాల్, సాబీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

సర్వేపల్లి అగ్రస్థానం : మంత్రి కాకాణి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. అలాగే మత్స్యకారుల కు వేటలేని సమయంలో జీవనోపాధి కొరకై 10000 రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. అలాగే మత్స్యకారులకు ముత్తుకూరులో మార్కెట్ నిర్మాణాన్ని కూడా చేపడుతున్నామన్నారు. ఆటో కార్మికులకు పదివేల రూపాయలు పంపిణీ చేపట్టామన్నారు, ఆసరా పథకం కింద 18,750 లో ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ లో భాగంగా తీసుకున్న బ్యాంకు రుణాలు నాలుగో విడత జనవరి 10 లోపు వారి ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. పిడత పోలూరు పంచాయతీలు 18 కోట్ల 65 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, అందులో 14 కోట్ల 85 లక్షల రూపాయల పనులు పూర్తి చేయడం జరిగిందని, ఇంకా సుమారు మూడు కోట్ల రూపాయలు పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. మండలంలో 268 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. అందులో నాడు నేడు, ఇరిగేషన్, డ్రైన్‌లు, సిమెంట్ రోడ్లు వంటి పనులు చేయడం జరిగిందన్నారు. వర్షాలు పడితే అందరూ ఆనందిస్తుంటే ఒక్క సోమిరెడ్డి మాత్రం ఏడుస్తుంటాడని తెలిపారు. అలాగే సైదాపురం మైనింగ్ను అడ్డుకుంటామని చెప్పిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ముడుపులు అందడంతో ఆ పోరాటాన్ని ఆపేసి, పొదలకూరు మైనింగ్ పై ఆందోళన చేయడం ఏమిటని ప్రశ్నించారు. పొదలకూరు మైనింగ్ లో

సోమిరెడ్డికి ముడుపులు అందకపోవడంతోనే ఆందోళన చేయడం జరిగింది అన్నారు. బాబు షిరిడి భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో అసలు భవిష్యత్తు లేదని దీనిని ప్రజలు గమనిస్తున్నారని ఆయన తెలిపారు. అనంతరం 8వ తరగతి చదువుతున్న మండలంలోని 462 మంది విద్యార్థులకు ట్యాబులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ వైద్యులు చంద్రశేఖర్, సమగ్ర శిక్షా అభియాన్ ఏపీసి ఉషారాణి, పార్టీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ గండవరపు సుగుణ, జడ్పిటిసి బందెల వెంకట రమణయ్య, సర్పంచులు యందోటి రాజకుమారి, కావలి విజయ్ కుమార్, అన్నా బత్తిన కృష్ణవేణి, నాయకులు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, కోటారెడ్డి, మునుకురు రవికుమార్ రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి, మేకల రమణయ్య, మస్తాన్, జమీల్ బాషా, కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ వివాద ఘర్షణలో ఒకరు మృతి :ముగ్గురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర -మర్రిపాడు :మండల పరిధిలోని భీమవరం పంచాయతీలో వడ్డిపాలెం గ్రామం లో భూవివాదంవల్ల ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ లో మాజీ సర్పంచ్ మంద రామరత్నారెడ్డి మృతి చెందారు.ముగ్గురు తీవ్ర గాయలపాల య్యారు. మృతుడు,రఘురామిరెడ్డి స్వయానదాయాదులు. మాగాణి భూములు అటు ఇటు మార్చుకొని సాగుచేసుకుంటున్నారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో గతంలో మృతుడు రామరత్నారెడ్డి రఘురామిరెడ్డి కి ఇచ్చిన భూమిలో సేద్యం చేస్తుండగా మృతుడు మండల రెవెన్యూ అధికారులు సమక్షంలో ఘర్షణలు పెట్టుకున్నారు.. వెంటనే మృతుని బంధువు రఘు రామిరెడ్డి భార్యను పారతో తలపై బలం గా కొట్టడంతో స్పృహతప్పి పడిపోయారు. ఆగ్రహించిన భర్త ట్రాక్టర్ కు గేజిల్ తగిలించి సేద్యం చేస్తూ మృతుని పై కి ఎక్కించారు. రెవెన్యూ సిబ్బంది సమక్షంలో ఈ ఘోరం జరగడంతో గ్రామస్తులు ముక్కున వేలేసుకున్నారు.సమాచారం అందుకున్న మర్రిపాడు ఎస్ ఐ విశ్వనాథ రెడ్డి సంఘటన స్థలాన్ని చేరుకొని వారిని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో మృతుని బందువులను ఎమ్మెల్యే మేకపాటి విక్రంరెడ్డి పరామర్శిం చారు. వివాదం విషయం తెలుసుకున్న ఆత్మకూర్ డీఎస్పి కోటారెడ్డి మరియు సంగం సీఐ రవి నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ వివాదంలో మనస్పర్థలు రావడంతో ఈ ఘర్షణ జరిగాయని డీఎస్పీ కోటారెడ్డి తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో బందోబస్తూ ఏర్పాటు చేయడం జర్గుగుతుందని ఆయన అన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం :మాజీ మంత్రి సోమిరెడ్డి

విశాలాంధ్ర -మనుబోలు : చంద్రబాబు తోని ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మనుబోలు మండలం కొలనుకుదురు గ్రామంలో బాబు భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర సుపరిపాలన అభివృద్ధి చంద్రబాబు నాయుడుతోని సాధ్యమని తెలిపారు .వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్ అయ్యాయని విమర్శించారు. తుఫాన్ లో పూర్తి స్థాయిలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని అన్నారు దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అరాచంసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సర్వేపల్లి లో అరాచకం సాగుతుందని విమర్శించారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడానికి టిడిపి నాయకులు కార్యకర్తలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గాలి రామకృష్ణారెడ్డి ,మస్తాన్ నాయుడు ,మధు నాయుడు ,పచ్చిపాల రామిరెడ్డి, కలిపి రమేష్ రెడ్డి, కసిరెడ్డి సునీల్ రెడ్డి, నిఖిల్ రెడ్డి, రైతు నాయకుడు రాయపాటి కిరణ్, పెద్ద ఎత్తున టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ138వఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు.దేవకుమార్ రెడ్డి ఆదేశాలతో నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం స్థానిక ఇందిరాభవన్లో సేవాదళ్ నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన అఖిలభారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 138 వ ఆవిర్భావ దినోత్సవం 100 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ శాసనసభ్యులు సీవి.శేషారెడ్డి కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కొండా. అనిల్ కుమార్ అధ్యక్షతన అఖిలభారత జాతీయ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సీవి.శేషారెడ్డి కాంగ్రెస్ పార్టీ దేశానికి రాష్ట్రానికి జిల్లాకు చేసిన అభివృద్ధిని గుర్తు చేశారు.ఆపై డీసీసీ అధ్యక్షుడు తలారి.బాల సుధాకర్ కాంగ్రెస్ పార్టీకి దేశ ప్రజలకుగాంధీ కుటుంభంకాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటికీ అందిస్తున్న సేవలను చేసిన త్యాగాలను గుర్తు చేశారు. తదుపరి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కొండా.అనిల్ కుమార్ నగర అధ్యక్షుడు షేక్. ఫయాజ్ కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవానికి, దేశం కోసం త్యాగాలు చేసిన అమరవీరల బలిదానాలకు ప్రతిగా వారి ఆశయ సాధనకోసం ప్రజాసంక్షేమం కోసం పని చేస్తామని ప్రతీజ్ఞ పూనారు. ఈ కార్య క్రమంలో పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.వి.శేషారెడ్డి,డిసిసి ఉపాధ్యక్షులు తలారి.బాల సుధా కర్,నగర అధ్యక్షుడు షేక్.ఫయాజ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కొండా.అనిల్ కుమార్,యుత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పర్తి.గణేష్ బాబు,ఎన్.ఎస్.యు.ఐ.అధ్యక్షుడు రాజా, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అన్నం.లతా రెడ్డి,బి.సి సెల్ అధ్యక్షుడుషేక్. మున్నా,మండలాధ్యక్షులు మద్దూరు.రాజగోపాల్ రెడ్డి,బిట్టా. కిషోర్ బాబు,మాజీ ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షుడు పఠాన్.మస్తాన్, సేవాదళ్ జిల్లా అధ్యక్షురాలు చేను.సుజాత,షేక్.రిజ్వానా,జలీల్,జియావుల్లా తదితరులు పాల్గొన్నారు.

మాగాణిలో మెట్ట పైర్లు సాగు చేయండి

వరి నాట్లు వేయొద్దు..వ్యవసాయ అధికారి రజిని

విశాలాంధ్ర-అనుమసముద్రంపేట : చెరువులలో తగినన్ని నీళ్లు లేకపోవడం సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువకు నీళ్లు విడుదల కాకపోవడం తదితర కారణాలవల్ల మండలంలోని రైతులు వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారి రజిని రైతులకు సూచించారు. ఏఎస్పేట వ్యవసాయ కార్యాలయంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సోమశిల ప్రాజెక్టు ఎస్సీ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఉత్తర కాలువకు సాగునీరు విడుదల చేయరని తెలిపారు. అందువల్ల రైతులు వరి సాగు చేయకుండా నువ్వులు ఉలవలు జొన్న తదితర పైర్లను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

అదాని కృష్ణపట్నం పోర్ట్ ఉద్యోగులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : అదాని కృష్ణపట్నం పోర్టు ఉద్యోగులలో భద్రతా సంస్కృతిని పెంపొందించే ప్రయత్నంలో భాగంగా ద్విచక్ర వాహనాల ద్వారా ప్రయాణించే ఉద్యోగులందరికీ ఉచితంగా హెల్మెట్లను గురువారం ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జిజేరావు చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా పోర్టు సీఈవో జి జే రావు మాట్లాడుతూ " పోర్ట్ లోని ప్రతి ఉద్యోగి భద్రత ప్రమాణాలను తప్పక పాటించి సురక్షితంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు ఉద్యోగం తో పాటు వ్యక్తి జీవితం చాలా ముఖ్యమైందన్నారు ప్రతి ఒక వ్యక్తి సురక్షితంగా భద్రత చర్యలు పాటిస్తూ పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు ముఖ్యంగా ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్స్ ధరించాల్సిందని అందుకోసం ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారులకి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు కానీ ఏ ఉద్యోగి లేదా కార్మికుడు ఇచ్చిన హెల్మెట్ ధరించకుండా పోర్ట్‌కు వస్తే, చర్యలు తప్పవని తెలిపారు. "చాలా మంది వ్యక్తులు హెల్మెట్ ధరించడం లేదా సరైన భద్రత నాణ్యమైన సురక్షితమైన హెల్మె ట్ ధరించడం ముఖ్యం అందుకు పోర్ట్ అత్యుత్తమ హెల్మెట్‌లను కొనుగోలు చేసి పోర్ట్‌కు ద్విచక్ర వాహనంలో వచ్చే ప్రతి ఉద్యోగి హెల్మెట్ ధరించేలా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. భద్రత పట్ల అదానీ గ్రూప్‌కు ఉన్న నిబద్ధతకు అనుగుణంగా ఈ చొరవ ఉందని శ్రీ రావు చెప్పారు. ఈ కార్యక్రమంలో పోర్టు సిఓఓ సంజయ్ కొత్త, రాజన్, బాబు, అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ, కార్పొరేటర్ అఫైర్స్ హెడ్ జి వేణుగోపాల్, సేఫ్టీ హెడ్ రామకృష్ణ, సెక్యూరిటీ డిజిఎం మనోహర్ బాబు,హెచ్ఆర్‌డిజి ఎంసిహెచ్ శ్రీనివాసులు, హెచ్వోడీలు పాల్గొన్నారు.

ప్రజా దీవెన యాత్ర కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర-ఉదయగిరి : పట్టణంలోని ఇంద్ర నగర్ కాలనీ అరుంధతి పాలెం లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా దీవెన యాత్ర గురు వారం ప్రారంభం అయింది ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు కలిసి గడపగడపకు తిరుగుతూ బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అంటూ ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఇరు నేతలు మాట్లాడుతూ రానున్నది తెలుగుదేశం పార్టీ పాలనని అన్నారు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రాక్షసి పాలనను అంతమొందిం చాలని న్నారు. మహానాడులో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రతి ఇంట ప్రచారం చేశారు మొదటిగా అధ్యక్షులు చింతన బోయిన బయన్న ఆధ్వర్యంలో నేతల కు ఘనంగా కార్యకర్తలు స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్ మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెటి వెంకట్ రెడ్డి చెప్పు మాజీ మండల కన్వీనర్ బజార్ నరసిం హులు ఎస్సీ సెల్ నాయకులు రాజా మైనార్టీ నాయకులు షేక్ రియాజ్ మహబూబ్ బాషా తెలుగు యువత అధ్యక్షుడు సయ్యద్ సం దాని జనసేన నాయకులు రవి ప్రకాష్ పాల్గొన్నారు.

ఉచిత ఆధార్ క్యాంప్

విశాలాంధ్ర - ఉలవపాడు : మండల పరిధిలోని కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఐటిడిఏ మరియు కరేడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఎస్టి లకు కొత్తగా ఆధార్ కార్డులు ఆధార్ కార్డు అప్డేషన్స్ ఆధార్ కార్డు బ్యాంకు లింకులు, నూతన స్టేట్ బ్యాంక్ అకౌంట్లు చేయడం జరిగింది. వీటిలో 12 బ్యాంక్ అకౌంట్లు 13 మందికి నూతన ఆధార్ కార్డులు చేసి కరేడు వైద్యాధికారి డాక్టర్ కే శ్రీనివాస రావు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ ఏపీఐఓ జాన్ ఏపీఐఓ మస్తాన్ ఫీల్డ్ ఆఫీసర్ పాల్గొన్నారు లక్ష్మీనారాయణ, సీతారాములు ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన సర్పంచ్

విశాలాంధ్ర - రాపూరు : ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు మధ్య హ్నం భోజనంను కేటాయించిన పద్ధతిలో వారి అరోగ్య రిత్య వారికి అందుతు న్నాయ లేదా అని అదికారులె కాకుండా ప్రజా ప్రతినిధులు కూడా తనిఖీ చేయడం డక్కిలి మండలం వెల్లంపల్లి ఎస్టిసి ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్నం భోజనం దేవుడు వెల్లంపల్లి పంచాయతీ సర్పంచ్ చింతపూడి సుజాత తనిఖీ చేశారు.పిల్లలను భోజనం బాగుందా, చదువు కోవాలని తెలియజేసారు. ప్రదానోపాధ్యా యులు దూడల పెంచలయ్య ఉపా ధ్యాయులు వున్నారు.

ఉజ్వల యోజన ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసిన బిజెపి

విశాలాంధ్ర - రాపూరు : రాపూరు మండలం రాపూరు మేజర్ పంచా యతీలోని ఆంజనేయ పురం గిరిజన కాలనీలో గురువారం, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు వెంకట గిరి నియో జకవర్గ కన్వీనర్ ఎస్ఎం ఆర్ నాయుడు చేతుల మీదుగా, ప్రధానమంత్రి ఉజ్వాల యోజన కింద ఉచితంగా హెచ్.పీ గ్యాస్ సెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ ఆర్ నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో, కాలనీలో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాలప్రజల కు, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అన్ని పథకాలనుతెలియ జేయాలని, అదేవిధంగా అందరికీ పథకాలన్నీ అందేలా చూడాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దూడల పెంచలయ్య, జయసింహా, ప్రదీ ప్ రెడ్డి, సుబ్రహ్మణ్యం ధనుంజయ, బూత్ కమిటీ సభ్యులు, ఆంజనేయపురం గిరిజన కాలనీ వాసులు పాల్గొన్నారు.

హిమాలయ శిఖరాలపై కందుకూరు టిడిపి జెండా

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : కందుకూరు నియోజకవర్గం నుంచి ఇంటూరి నాగేశ్వరరావు అఖండ మెజారిటీతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ హిమాలయ శిఖరంపై యువకులు తెలుగుదేశం జెండా ఎగురవేశారు. వలేటివారిపాలెం మండలం జడ్. ఉప్పలపాడు గ్రామానికి చెందిన సోమినేని నరేష్, సోమినేని మనోహర్, కోటపాటి శ్రీకాంత్‌లు తెలుగుదేశం జెండాను ఎగుర వేశారు. మంచి మనసున్న నాయకుడు ఇంటూరి నాగేశ్వ రరావు రాజకీయాల్లో హిమాలయాల అంత ఎత్తుకు ఎదగాలని... నియో జవర్గ యువత ఆయన వెంటే నడుస్తోందని వారు తెలిపారు. నాగేశ్వరరావు విజయాన్ని మళ్ళీ ఇదే హిమాలయలపై జరుపుకుం టామని ఆ యువకులు తెలియజేశారు.

కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఉప విద్యాశాఖ అధికారి

విశాలాంధ్ర - ఉలవపాడు : ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ అలాగాయపాలెం ప్రైమరీ కాంప్లెక్స్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి కందు కూరు ఉప విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాస రావు మండల విద్యాశాఖ అధికారి ఎంవివి ప్రసాద్ రావు హాజరయ్యారు. ఉప విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలకు అందిస్తున్న డిజిటల్ పరికరాలను ఉపయోగించుకొని సామర్థ్య వంతంగా విద్యార్థులకు మెరుగైన బోధనను అందించాలని కోరారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కాంప్లెక్స్ జరుగుతుంది. కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్స్ రమేష్ జాలయ్య మురళి కృష్ణ పాఠ్యాం శాలలో నూతన ప్రణాళికలను అక్క డికి వచ్చిన ఉపాధ్యాయులకు తెలియజేశారు జనవరిలో పరీక్షలు ఉన్నందున పిల్లలకు నూతన విద్యా విధానంపై తెలపాలన్నారు.

అంగన్వాడీ కార్యకర్తల నిరసనకు తెదేపా మద్దతు

విశాలాంధ్ర- ఉదయగిరి :స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడి కార్యకర్తల 16వ రోజు నిరసన కార్యక్రమం గురువారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో టీడీపీ స్థానిక శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి మాజీ ఎమ్మెల్య బొల్లినేని వెంకట రామారావు నిరసన శిబిరానికి చేరుకొని సంఘీభావం వ్యక్తపరిచారు ఈ సంద ర్భంగా ఇరువురు నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. రానున్నది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వగానే అంగన్వాడి కార్యకర్తలు సమస్యలు తీరుస్తారని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చంచల బాబు యాదవ్ మండల కన్వీనర్ చంద్రబోయిన బయన్న మాజీ మండల కన్వీనర్ బొజ్జ నరసింహులు పాల్గొన్నారు.

సండే మార్కెట్ క్యాలెండర్-2024 ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: స్థానిక సండే మార్కెట్ లోని నెల్లూరు రోడ్డు మార్జిన్ సంక్షేమ సంఘంకార్యాలయం వద్దసండే మార్కెట్ క్యాలెండర్ 2024 ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాసైన్స్ వేదిక నాయకులు జి.మాల్యాద్రి మాట్లాడుతూ సండే మార్కెట్ కమిటీ మిత్రులు 15 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఒక మంచి క్యాలెండరు తీసుకొస్తున్నారు,ప్రతి సంవత్సరం జనం ఎదురుచూసే విధంగాక్యాలెండర్ రూపకల్పన చేస్తున్నారన్నారు. ఈ సంవత్సరం క్యాలెండర్‌లో మూడు ముఖ్యమైన అంశాలు ఉన్నాయన్నారు. మనం ఎలా ఆలోచించాలి, సమాజం ఎలా ఉండాలి , ఆరోగ్యం గురించిన ఒక నినాదం ప్రతి నెల పేజీలో ఉందని తెలిపారు. పాత రోజుల్లో పెద్దలు మనకు మంచి విషయాలు చెప్పిన విధంగా ఈ క్యాలెండర్ లో చాలా మంచి విషయాలు ఉన్నాయన్నారు. గతంలో కూడా సండే మార్కెట్ కమిటీ పర్యావరణం, విద్య ఆరోగ్యం ఇలా చాలా విషయాలు మీద క్యాలెండర్ తెచ్చారన్నారు.క్యాలెండర్ అంటే ఏదో బొమ్మలతో ఉండటం కాకుండా ఇలా మంచివిషయాలతోప్రత్యామ్నాయంగా ఉండాలని ఆకాంక్షించారు.క్యాలెండర్ లోనిప్రతి తేదీ కింద ఆ తేదియొక్క ప్రత్యేకతను తెలియజేయడం వీరి సంప్రదాయంగా ఉందని కొనియాడారు. సండే కమిటీ అధ్యక్షులు ఎండి హాఫిజుద్దీన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఆఫీస్ నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రత్యేక అంశం తోటి ప్రతి సంవత్సరం క్యాలెండర్2ని చేస్తున్నామని, పట్టణ ప్రజల ఆదరణకు కృతజ్ఞతలు తెలియజేశారు.సండే మార్కెట్ కమిటీ మాజీ కార్యదర్శి శరవణ మాట్లాడుతూ సండే మార్కెట్ క్యాలెండర్ ప్రజలకు విజ్ఞానదాయకంగారూపొందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టియు నాయకులు పి. యానాదయ్య సండే మార్కెట్ కార్యదర్శి ఆర్ సంధిల్ కుమార్ కోశాధికారి మత్తుమారి సీనియర్ నాయకులు టి.రమేష్, నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో టీడీపీ కార్యాలయానికి భూమిపూజ : కురుగొండ్ల

విశాలాంధ్ర - రాపూరు : రాపూరు పట్టణంలోని హైవే రోడ్డు హెచ్ పి పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న స్థలం లో టిడిపి కార్యాలయానికి భూమి పూజ చేశారు. స్థల దాతప్రముఖపారిశ్రామికవేత్త రాపూరు మండల స్థానికులు దానశీలి బండి వేణుగో పాల్ రెడ్డి తెలుగు దేశం పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం కెటాయించారు. ఆ స్థలంలో గురువారం మాజీ శాసనసభ్యు లు వేంకట గిరి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇంచార్జి కురుగొండ్ల రామ కృష్ణ ప్రత్యక్ష పర్యవేక్షణలో రాపూరుమండల టిడిపి అధ్యక్షు లు దందొలు వేంకటేశ్వ రెడ్డి అధ్యక్షతన,తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షులు కొండ్లపొడి రాఘవ రెడ్డి,తిరుపతి పార్లమెంటు అధికారి ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ, మండల మహిళా అధ్యక్షురాలు చివులూరు రవణమ్మలతో రాపూరు పట్టణం తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఏదొటి.కోటీశ్వరావు దంపతులు చేతులు మీదుగా పార్టీ కార్యాలయ భవన నిర్మాణ భూమి పూజను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండలం పరిశీలకులు ఏలేశ్వరం రామచంద్రయ్య,డక్కిలి మండల అధ్యక్షులు పొలం రెడ్డి కోటీశ్వరరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఖాజా మొహిద్దీన్,సైదాపురం నాయకులు కాపా శ్రీనివాసులునాయుడు, టిఎన్‌టియుసి అధ్యక్షులు మంకు ఆనంద్,మండల నాయ కులు డాక్టర్ వేణుగోపాల్, దా మోదర్ నాయుడు,కండే రమ ణయ్య,పరంధామరెడ్డి,శివారెడ్డి రాజా, వేంకటేశ్వర్లు నాయుడు, చెంచయ్య,పాపయ్య,సర్పంచ్ కొమ్మిజంగం నాయుడు, మధు నాయుడు,రమేష్,వసంత్,డక్కిలి మండలం నాయకులు చంద్రా రెడ్డి,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ చేపట్టిన ఆర్టిఓ రాములు

విశాలాంధ్ర -మర్రిపాడు : మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా నెల్లూరు ముంబై జాతీయ రహదారి పై ఆర్టిఓ రాములు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న పలు వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాటికి అపరాధ రుసుం విధించారు. రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు నిబంధనలు తప్పక పాటించాలని మద్యపానం సేవించి వాహనం నడపరాదని వాహనదారులను కోరారు. ఈ తనిఖీలో భాగంగా అధిక లోడుతో వెళ్తున్న నాలుగు వాహనాలకు ముప్పై వేల రూపాయలు చలన విధించడం జరిగిందని ఆర్టీవో రాములు తెలిపారు.ఈ తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

జాడ లేని ఉద్యానవన శాఖ అధికారయంత్రాంగం.!

విశాలాంధ్ర - ఉలవపాడు : మండల పరిధిలో వాణిజ్య పంటలైన మామిడి సపోటా వేల ఎకరాల్లో సాగు చేయబడుతుంది. ఈ మధ్య కురిసిన వర్షాల వల్ల రకరకాల తెగుళ్లతో రైతులను తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అయితే రైతులకు అండగా ఉండి సకాలంలో వినియోగించవలసిన క్రిమిసంహారకాలు, పలు రకాల సేద్య విధానాలపై అవగాహన కల్పించి రైతులకు అండదండగా నిలవాల్సిన ఉద్యానవన శాఖ అధికారుల జాడ అంతంత మాత్రంగా వుంది. మండలంలోకి చుట్టం చూపుగా వచ్చి ఏదో తమ సంతకాలు పెట్టుకొని పని చేస్తున్నాం అన్నట్లుగా వుంది. రైతులకు వాళ్ళు ఎలాంటి సహాయ సహకారాలు అందించవలసిన అవసరం లేదనే విధంగా ప్రవర్తిస్తున్నారు. మామిడి, సపోటా రైతులకు ఎలాంటి సూచనలు సలహాలు అందించలేని స్థితిలో ఉన్నారంటే వృత్తి పట్ల వారికి ఉన్న నిబద్ధత అట్లే అర్థం అవుతుంది. ఒకవైపు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా రైతులను ముందు వరుసలో నిలబెట్టాలని ఉద్దేశంతో రైతు భరోసా, రైతులకు శిక్షణ శిబిరాలు వంటి ఏర్పాటు చేసి రైతు ప్రభుత్వం అంటూ చెప్పుకుంటున్నారు.ఈ నేపథ్యంలో ఉలవపాడు మండల ఉద్యానవన శాఖ అధికారులు తీరు పలు విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా చెప్పాలంటే మండలంలో ఉద్యానవన శాఖ అధికారులు కలవాలంటే కనీసం ఉద్యానవన శాఖ కార్యాలయం కూడా లేకపోవడం హాస్యాస్పదం గా ఉంది. ఎవరైనా రైతులు వారిని ఫోన్లో అయినా సంప్రదించే ప్రయత్నం చేయాలంటే వారిలో ఫోన్ ఫీడ్ అయిన నెంబర్లు మాత్రమే లిఫ్ట్ చేస్తారు.. తప్ప కొత్త వ్యక్తుల నెంబర్లను లిఫ్ట్ చేసే పరిస్థితులు లేరు. వారు నిర్వహించవలసిన ఈక్రాప్ నమోదు కానీ, నూతనంగా వాణిజ్య పంటల వైపు రైతులు ఆకర్షింప చేసే పథకాలను వివరించలేకపోతున్నారు. నష్టాల్లో కూరుకుపోతున్న రైతులను దళారుల నుంచి కాపాడే ప్రయత్నం గానీ వాణిజ్య పంటలు ఆవశ్యకతను తెలియజేప్పే ప్రయత్నం గానీ ఉద్యానవన శాఖ అధికారులకు పట్టడం లేదని పలువు రైతులు చర్చించుకుంటున్నారు. ఇది ఒక్క మన మండలంలోని ఇలా ఉందని దీనిపై ఉన్నతాధికారులకు కూడా మన మండలం వైపు కన్నెత్తి చూడక పోవడం తో వీరి ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది అని పలువురు గుస గుస లాడుతున్నారు. .

ఎంపీ ఆదాల సమక్షంలో టీడీపీ కుటుంబాలు వైసీపీలో చేరిక

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 31వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో టైలర్స్ కాలనీకి చెందిన 50 టిడిపి కుటుంబాలు వైఎస్ఆర్సిపిలో చేరారు. గురువారం 31వ డివిజన్లోని టైలర్స్ కాలనీలో ఆ డివిజన్ నాయకులు నాయబ్ రసూల్, ఖాదర్ మస్తాన్ లఆధ్వర్యంలో ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్సిపి కండువా కప్పుకున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన 50 టిడిపికి చెందిన కుటుంబాలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి వైకాపాలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎంపీ ఆదాల వైఎస్ఆర్సిపి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఏ కష్టం వచ్చినా అన్ని సమయాల్లో అందుబాటులో ఉండి అండగా ఉంటానని ఎంపీ పార్టీలో చేరిన టిడిపి మద్దతుదారులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పొట్లూరు స్రవంతి జయవర్ధన్, 31వ డివిజన్ ఇంచార్జీలు చెన్నారెడ్డి నవీన్ కుమార్ రెడ్డి, టీవీఎస్ కమల్, బోయిల్ల ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కౌన్సిల్ సమావేశాలకు నెల్లూరు జిల్లా ఎన్జీవో నేతలు

విశాలాంధ్ర-బ్యూరో నెల్లూరు : ఏపీయన్‌జీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కామ్రేడ్ బండి శ్రీనివాసరావు కామ్రేడ్ కే వీ శివారెడ్డిలఆధ్వర్యంలో ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు సమీర్ భట్టాచార్య మంచా సమావేశ మందిరం సాల్ట్ లేక్ సిటీ కలకత్తా వెస్ట్ బెంగాల్‌లో జరుగుచున్నవి.ఈ సమావేశంలో ముఖ్యంగా సీపీఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరిద్ధరించాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని ప్రైవేటీకరణను నిలుపుదలచేయాలని, ప్రభుత్వ రంగ సమస్థలను ప్రోత్సహించాలని ప్రజాస్వామ్య కార్మిక సంఘాల హక్కులను పరిరక్షింక్షాలని జాతీయ విద్యావిధానాన్ని వదిలి వేయాలని. 8 వ జాతీయ వేతన సవరణ కమీషన్‌లో పేర్కొన్న డీఏను విడుదల చేయాలని, 18 నెలలుగా ఉన్న డీ ఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, కారుణ్య నియామకాల పథకంలో గల అన్ని అడ్డంకులను తొలగించాలని జాతీయ చైర్మన్ కన్వీనర్లు శ్రీకుమార్ సుభాష్ లంబా మాట్లాడడం జరిగింది.కలకత్తాలో జరుగు సమావేశానికి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నుండి ఏపీయన్‌జీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు, జిల్లా కోశాధికారి బండారుపల్లి వెంకటేశ్వర్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ లు పాల్గొన్నారు.

పలువురి టిడిపి కార్యకర్తలకు ఘననివాళి

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : గత ఏడాది డిసెంబరు 28వ తేదీన, శ్రీ నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 8 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.ఆ దుర్ఘటన జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా, ఆ కార్యకర్తలను గుర్తు చేసుకుంటూ, కందుకూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ,మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం పలువురు నాయకులు హాజరై వారికి ఘనంగా నివాళులర్పించారు.పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షుడు నార్నే రోశయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, సీనియర్ నాయకులు నాదెళ్ల వెంకట సుబ్బారావు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, రెబ్బవరపు మాల్యాద్రి, పొడపాటి మహేష్, చుండూరి శ్రీను , షేక్ సలాం, సవిడిబోయిన వెంకటకృష్ణ, బద్దిపూడి శిఖామణి, మచ్చా మనోహర్, పున్నారావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచాన్ని నడిపిస్తున్నది సైన్స్..ఓవెల్ పాఠశాలల సీఎం డి వేణు

విశాలాంధ్ర- నెల్లూరు టౌన్ : ప్రపంచాన్ని నడిపిస్తోంది సైన్స్ మాత్రమేనని ఓవెల్ పాఠశాలల సీఎం డి వేణు పేర్కొన్నారు. నెల్లూరు 11వ డివిజన్లోని సరస్వతి నగర్ ఓవెల్ మోడరన్ పాఠశాలలో గురువారం సైన్స్ లాంచర్ -2, గెలాక్సీ ఎక్స్ పో 23-24 వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను వేణు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్ర ప్రాముఖ్యత, దాని ఉపయోగాలు తెలుసుకోవడమే ఈ వైజ్ఞానిక ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీఈవో ప్రమీల, జీఎం మహదేవ్, ఈడి బాలు, డీజీఎం శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రమణయ్య నాయుడు, ప్రైమరీ ఇంచార్జ్ రమాదేవి, హై స్కూల్ ఇంచార్జ్ ప్రసాద్ రెడ్డి, సైన్స్ కన్వీనర్ రామారావు, కో కన్వీనర్ విజయనిర్మల, సీజీఎం సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు : విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. . చంద్రయాన్ -3, రెయిన్ డిటెక్టర్, సునామీ ఎఫెక్ట్, హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్లాంట్, సోలార్ అండ్ లూనార్ ఎక్లిప్స్, హైడ్రాలిక్ క్రేన్, బ్లడ్ టెస్ట్, ఎసిటిలిన్ గ్యాస్ ప్రిపరేషన్ వంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతకు అద్దం పట్టాయి.

8 ఏళ్ల తర్వాత మళ్లీ మీ జీ సినిమా లో!

మెగాస్టార్ చిరంజీవి సూపర్ హిట్ యాక్షన్ ఇంద్ర..

విశాలాంధ్ర -నెల్లూరు : తెలుగు టెలివిజన్ ఇండస్ట్రీలో అత్యంత ఆదరణ గల ఛానల్జీ సినిమాలు. వారం వారం సరికొత్త సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న జీ సినిమాలు మెగా బ్లాక్బస్టర్ మూవీ 'ఇంద్ర'తో ఈ ఏడాదిని ఘనంగా ముగించేందుకు సిద్ధమైంది. ఇంద్ర సినిమా విడుదలైఘనవిజయం సాధించి రెండు దశాబ్దాలు పూర్తయింది. మెగాస్టార్ చిరంజీవి, సోనాలీ బింద్రేజంటగా నటించిన యాక్షన్ ఎంటర్ టైనర్ ఇంద్ర, డిసెంబర్ 30న సాయంత్రం 6 గంటలకు జీ సినిమాలులో!

ఎనిమిదేళ్ల తర్వాత మరోసారి బుల్లితెర ప్రేక్షకులను అలరించేందుకు జీ సినిమాలు వేదికగా ఇంద్ర సినిమా ప్రసారం కానుంది. వైజయంతీ మూవీస్సమర్పణలో బి.గోపాల్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ప్యాక్డ్ చిత్రం ఇంద్ర. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విడుదలై 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మరోసారి మెగాస్టార్ చిరంజీవి, సోనాలి బింద్రే నటించిన ఈ సినిమా విజయాన్ని అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు.ఈ సినిమా మూడు నంది అవార్డులను గెలుచుకుంది.